క్లుప్తంగా

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

తెనాలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఫిబ్రవరి 28వ తేదీ లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని తెనాలి అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ ఎం. శ్రీరామచంద్రమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ ట్రెజరీ కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్ సర్పించాలని, కార్యాలయానికి రాలేని వారు జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా తమ తమ స్మార్ట్‌ఫోన్‌లలో నమోదు చేసుకోవాలని సూచించారు. అలానే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులను సంప్రదించి వారి ద్వారా సర్టిఫికెట్‌ను సమర్పించుకోవచ్చని తెలిపారు. జీవన్ ప్రమాణ్ యాప్ ఫిబ్రవరి 28 వరకు అందుబాటులో ఉంటుందని ఏటీవో చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) క్యాలెండరును తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ భాషా మౌఖిక ఆదేశాల ప్రకారము తెనాలి, దుగ్గిరాల యూనిట్ల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సంఘ క్యాలెండర్‌లో ప్రభుత్వ సెలవు దినాలు, ఐచ్ఛిక సెలవుదినాలను ఇవ్వటం వల్ల, ఉద్యోగులందరికీ ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగులందరూ స్నేహపూర్వకంగా సోదర భావంతో కలసిమెలసి క్యాలెండరును రూపొందించుకోవటం సంతోషంగా ఉందన్నారు. దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి, ఉపాధ్యక్షుడు వంకదార సుబ్బారావు, తెనాలి యూనిట్ సహాధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దగ్గుబాటి సుధీర్, కార్యదర్శి కారుమూరు కమలకుమారి, కోశాధికారి గైరుబోయిన విజయలక్ష్మి, దుగ్గిరాల యూనిట్ కార్యదర్శి గుంటూరు పూర్ణప్రసాద్, సభ్యులు దినకర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి మండలం కొలకలూరు రైల్వే స్టేషన్ వద్ద గురువారం చోటుచేసుకుంది. కొలకలూరుకు చెందిన మోదుకూరు విజయ్ కుమార్(45) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఉదయాన్నే పనుల నిమిత్తం బయటకు వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): గ్రామ స్థాయి అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా గ్రామ సచివాలయానికి వచ్చి అధికారులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాడా శ్రీనివాసరావు, మనిపల్లె చిన్న తాండ్ర పద్మావతి, బేసాబత్తుని నాగాంజనేయులు ఉన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

వేమూరు: మద్యం బెల్టు షాపు నిర్వాహకుడి వద్ద 8 బాటిల్స్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ రవి కుమార్ తెలిపారు. కొల్లూరు మండలంలోని పెదలంక గ్రామంలో గురువారం మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోమని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆయన అన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో గురువారం స్వయం ఉపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదటి విడతగా 10 మందికి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఎ.సాంబశివరావు, బాబూజీలు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఫలించిన కల

- డిగ్రీతోనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో కొలువు
- ప్రస్తుతం ఏడాదికి రూ.8 లక్షల వేతనం
- మధ్యతరగతి యువకుడి ప్రస్థానం



ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌చంద్‌తో భార్గవ్ వెంకటసాయి

తెనాలి: ఫీజు రీయింబర్స్‌మెంట్. మహానేత, అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి మానసపుత్రిక. పేద, మధ్యతరగతి వర్గాల్లోని విద్యార్థులు ఉన్నతవిద్య చదివేందుకు ఎంతగానో తోడ్పడిన పథకం. ఎంతోమంది ఈ పథకం ఆసరాతో చదువుకున్నారు. ఉద్యోగాల్లో చేరారు. జీవితానికో భరోసాను కల్పించుకున్నారు. బైనా భార్గవ్ వెంకటసాయి అలాంటి వారిలో ఒకరు. కేవలం డిగ్రీ చదువుతోనే సాఫ్ట్‌వేర్ కొలువును అందుకున్నాడు. తన కలలను పండించుకున్నాడు. ప్రస్తుతం రూ.8 లక్షల వార్షిక వేతనం అందుకుంటున్నాడు. భార్గవ్ వెంకటసాయి స్వస్థలం తెనాలి. తండ్రి శ్రీనివాసరావుది సాధారణ వ్యాపారం. తల్లి కృష్ణవేణి గృహిణి. ఇద్దరు బిడ్డల్లో పెద్దవాడైన భార్గవ్ తొలినుంచీ చదువులో సత్తా చాటుతూనే వచ్చాడు. టెన్త్‌లో 83 శాతం మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. ఇంటర్‌లో 950/1000 మార్కులు సాధించాడు. 2017లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ (కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్)లో చేరాడు. 2019-2020 విద్యా సంవత్సరంలో ఫైనలియర్‌లో ఉండగా, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మూడు కంపెనీలకు ఎంపికయ్యాడు. వీటిలో టీసీఎస్ కంపెనీని ఎంచుకున్నాడు. 'ప్రాసెస్ అసోసియేట్ టెక్నికల్ స్పెషలిస్టు'గా రూ.1.90 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగంలో చేరాడు. టీసీఎస్‌లో మూడేళ్లు పని చేశాక గూగుల్‌కు వర్క్‌చేసే టెలీఫెర్ఫార్మెన్స్ కంపెనీలో చేరారు.

బిజినెస్ అనలిస్టుగా ఆర్నెల్లు కంపెనీలో చేశాక, కొద్దిరోజుల క్రితమే ప్రముఖ బహుళజాతి కంపెనీ ఇన్ఫోసిస్‌లో ఆఫర్ వచ్చింది. సీనియర్ టెక్నికల్ స్పెషలిస్టుగా ఎంపికయ్యారు. వార్షిక వేతనం రూ.8 లక్షలుగా అందుకోబోతున్నాడు. నూతన ఉద్యోగంలో చేరిన తర్వాత స్వస్థలం వచ్చిన భార్గవ్ వెంకటసాయి, తాను చదువుకున్న ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీకి గురువారం వచ్చారు. కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌తో సహా తనకు శిక్షణనిచ్చి, కార్పొరేట్ రంగంలో రాణించేందుకు తోడ్పడిన ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

తన తర్వాత సోదరుడు శివసాయి కూడా అదే కాలేజీలో 2018-21 బ్యాచ్‌లో బీఎస్సీ (ఫిజిక్స్, మాథ్స్) పూర్తిచేసినట్టు చెప్పాడు. ప్రస్తుతం తండ్రి వ్యాపారంలో సహాయకారిగా ఉంటూ ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లనున్నట్టు వివరించారు. తమ ఇద్దరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఆసరానివ్వగా, క్యాంపస్ కొలువకు కాలేజీలో ఇచ్చిన శిక్షణ తోడ్పడిందని భార్గవ్ వెంకటసాయి వెల్లడించారు.

> **డిగ్రీతో ఉద్యోగం సాధ్యం కాదన్నారు**
>
> 
>
> డిగ్రీ కోర్సులో చేరినప్పుడు డిగ్రీతో ఉద్యోగాలు సాధ్యం కాదనే అభిప్రాయం ఉండేది మాలో. ఇంగ్లిష్ చక్కగా మాట్లాడటం, భావప్రకటనా సామర్థ్యం, చొరవ ఉంటే కార్పొరేట్ ఉద్యోగాలకు క్యాంపస్ ఇంటర్వ్యూలు మార్గం చూపుతాయని చెప్పేందుకు నేనూ నిదర్శనం. నాలాంటి ఎందరికో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉపకరిస్తే, కాలేజీ చదువు పునాది వేసింది.
>
> – భార్గవ్ వెంకటసాయి, తెనాలి

5న గుంటూరులో ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల ఆత్మీయ సమావేశం

తెనాలి: 'ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, గెస్ట్ లెక్చరర్స్ సమస్యలు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఈనెల 5న గుంటూరులో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ లభ్యర్థి లగడపాటి వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు అరండల్‌పేట 4/1లోని గీతాకేఫ్ ఎదురు సాయంత్రం 5 గంటల నుంచి సమావేశం జరుగుతుందని తెలిపారు. ఎస్‌టీయూ, ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు, వివిధ కళాశాలలకు చెందిన ప్రైవేట్ లెక్చరర్లు, గెస్ట్ లెక్చరర్లు జిల్లా వ్యాప్తంగా హాజరవుతున్నట్టు తెలిపారు. సమస్యలపై చర్చించిన తదుపరి నివేదికను తయారుచేసి కచ్చితంగా అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని వివరించారు. ఉపాధ్యాయులకు ఉపకరించే సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని వేణుగోపాల్ కోరారు.

ఎస్ఎంసీ సభ్యులకు ఒక రోజు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతిబాబు

తెనాలిరూరల్: విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రతి పాఠశాలలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించడంతో, పాఠశాలలను అభివృద్ధి పరచడంలో, ఉత్తమ ఫలితాలను సాధించడంలోను పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలు సభ్యులకు తెలియజేయడమే ముఖ్య ఉద్దేశంగా ఒక్కరోజు ఎస్ఎంసీ సభ్యుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెనాలి విద్యాశాఖాధికారులు ఎం.లక్ష్మీనారాయణ, వి.జయంతి బాబు తెలిపారు. గురువారం కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల యజమాన్య కమిటీ శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో జరిగిన జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం అనంతరం ఈ రోజు మండల స్థాయిలో తెనాలి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటు- విధులు, బాధ్యతలు బాలల హక్కులు పరిరక్షణ, ఎస్ఎంసీ కమిటీ సమావేశాలు నిర్వహణ-విధి విధానాలు, పాఠశాలఅభివృద్ధి ప్రణాళిక, ప్రజల భాగస్వామ్యం, సమకాలీన సమస్యలు, పరిష్కారం అనే అంశాలపై జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్ ద్వారా అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్‌గా షేక్ షరీఫ్, జక్కా వీరాంజనేయులు, కె.మాధురీ లత, ఎ. హరి వరప్రసాద్, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేయాలి

రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గణేష్



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయటం జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ పిలుపునిచ్చారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేలా ప్రతినాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడతామన్నారు. గ్రామ, మండల స్థాయి కమిటీలు ఐక్యంగా ఉండి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన షిర్డీ సాయిబాబా వార్షికోత్సవాలు



గీతా పారాయణంలో సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం నిర్వాహకులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయి బాబా ఆలయంలో 80వ జయంతి వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబావారికి ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, కాకడ హారతి శాస్త్రయుక్తంగా నిర్వహించారు. సబ్ పోస్ట్‌మాస్టర్ రాచపూడి చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన, ఆర్యవైశ్య కల్యాణ మండప కార్యదర్శి అన్నవరపు వెంకట సుబ్బారావు పతాకావిష్కరణ గావించారు. పూజా కార్యక్రమాల్లో కొమ్మినేని నాగభూషణం, ధనలక్ష్మి, బూర్లె విజయకుమార్, రోజారాణి దంపతులు పాల్గొన్నారు. సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి ఆధ్వర్యంలో గీతా పారాయణం జరిగింది. షిర్డీ సాయిబాబా జీవిత చరిత్రలోని కొన్ని అంశాలు, స్తోత్ర మంజరి, స్తవన మంజరి, స్తుతులు, గేయాలను హేమవిఠలేశ్వర స్వామి దేవస్థాన కమిటీ మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి పల్లకి, ఊయల, పవళింపు సేవలు, శేజ్ హారతి నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

బ్లడ్ బ్యాంక్‌కు రిఫ్రిజిరేటర్ అందజేత



రేపల్లె రూరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్లడ్ బ్యాంక్‌కు రేపల్లె పట్టణానికి చెందిన వ్యాపారవేత్త దండుప్రోలు పిచ్చియ్య తన తండ్రి పెదసుబ్బారావు జ్ఞాపకార్థం రిఫ్రిజిరేటర్, ఏసీ పరికరాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంక్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు దాతలు సహకరించాలన్నారు. బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన పరికరాలను అందించిన పిచ్చియ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గురుప్రసాద్, మోపిదేవి వీర్రాజు, దేవగిరి రవి, అమర్‌నాథ్, అడుసుమల్లి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

లవకుమార్‌కు సత్కారం



వేమూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన కోగంటి లవకుమార్‌ను పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. నూతనంగా జిల్లా పార్టీ పదవి పొందిన లవకుమార్‌కు ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని లవకుమార్ వాగ్దానం చేశారు. . పార్టీ నాయకులు, కార్యకర్తలకు తన పూర్తి సహకారం ఉంటుందని ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దున్నా మేరీసుబాబు, కూచిపూడి మోషే, దున్నా వెంకయ్య పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు నూతక్కి విద్యార్థి ఎంపిక

మంగళగిరి: నూతక్కి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.వెంకట పుష్పలత జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. గత నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన అంతరాష్ట్ర వాలీబాల్ పోటీల్లో.. గుంటూరు జిల్లా బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 9వ వ తరగతి విద్యార్థినిని పీడీ రజినీనాయక్, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



అర్జీ స్వీకరిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. తెనాలి చినరావూరు పరిధిలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ ప్రాంత రైతులు తమ తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ సదస్సులో రైతులు వారికి సంబంధించిన పలు సమస్యల్ని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని, అలానే ప్రజా సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి సర్వే, మ్యుటేషన్, పొలం వైశాల్యం వంటి పలు సమస్యలను నివేదిస్తూ 21 అర్జీలు వచ్చాయి. వీటిని త్వరలో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

ఎస్ఎంసీ విధులు, బాధ్యతలపై శిక్షణ



పల్లెకోన(భట్టిప్రోలు): మండల స్థాయి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) విధులు, బాధ్యతలపై భట్టిప్రోలు మండలం పల్లెకోన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎస్ఎంసీ సభ్యులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో నీలం దేవరాజు మాట్లాడుతూ ఎస్ఎంసీ సభ్యులు పాఠశాలల అభ్యున్నతికి తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఎస్ఎంసీ విధులు, బాధ్యతలపై రిసోర్స్ పర్సన్స్ వి.సురేష్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, పి.కిషోర్‌లు తెలియజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇ.మునియ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా హైస్కూళ్ల హెచ్ఎంలు ఎస్కే మహబూబ్ బాషా, ఎండీ సుభానీ, సీహెచ్ రామకోటేశ్వరరావు, కె.అరుణ కుమారి, ఎస్ఎంసీ నిర్వాహకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



చుండూరు(వేమూరు): నూతన సంవత్సరం సందర్భంగా యూటీఎఫ్ నాయకులు క్యాలెండర్ విడుదల చేయడం జరిగిందని మండల విద్యాశాఖాధికారి చలపతిరావు తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ యూనియన్ నాయకులు ప్రతి ఏడాది డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించడం జరుగుతుందని అన్నారు. యూనియన్ నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 సలోమన్, కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తగదు



కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను గత 30 సంవత్సరాలకు పైబడి పరిష్కరించకపోవడం పాలక పక్షాల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందని సీఐటీయూ తాడేపల్లి డివిజన్ కార్యదర్శి వేముల దుర్గారావు విమర్శించారు. గురువారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సిమెంట్ కంపెనీ లాకౌట్ అయ్యి.. 30 ఏళ్లు అవుతోందని, ఇప్పటికే 160 మందికి పైగా కార్మికులు చనిపోయారని తెలిపారు. వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కోరారు. దీక్షలో రమాదేవి, శారమ్మ, లక్ష్మి, సామ్రాజ్యం, దీనమ్మ కూర్చొనగా, కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, సూర్యప్రకాష్, అంకయ్య సాంబయ్య, నవనీతం సంఘీభావం తెలిపారు.

తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సులు





రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



పెదగాదెలవర్రు రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ నాగరాజు

చుండూరు(వేమూరు): రెవెన్యూ సదస్సులు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయి. చుండూరు మండలంలోని పెదగాదెవర్రు గ్రామంలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. రైతులు 4 అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించి, పరిష్కరిస్తామని తహసీల్దారు నాగరాజు తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో రెవెన్యూ సదస్సులకు ప్రజలు హాజరు కావడం లేదని ఆయన అన్నారు. రెవెన్యూ సదస్సులకు అన్ని శాఖల సిబ్బంది హాజరు కాకపోవడం, ప్రజలు రాకపోవడంతో కుర్చీలు ఖాళీగా ఉంటున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులు సమస్యల కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె రూరల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పూడి, గుడ్డికాయలంక గ్రామాలలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. సదస్సుల్లో భూ సమస్యలపై అందిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారించి 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురికి 1బీ కాపీలను అందజేశారు. ఉప్పూడిలో 11, గుడ్డికాయలంకలో 16 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



క్రాపలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

పల్లెకోన, రాచూరులలో రెవెన్యూ సదస్సులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పల్లెకోన, రాచూరు పంచాయతీ కార్యాలయాల ఆవరణలో గురువారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భూమి క్రయ, విక్రయాలు, పేరు మార్పునకు, భూ రిజిస్ట్రేషన్ల సమస్యలను దరఖాస్తు రూపంలో తెలియ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాచూరు సర్పంచ్ జయవరపు రాధాకృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు పంచాయతీ కార్యదర్శి వక్కలగడ్డ సురేష్, దేవదాయ శాఖ మండల ఇన్‌చార్జ్ దీవి వేంకటప్లాచార్యులు, ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.


నేడు బలిజేపల్లిలో రెవెన్యూ సదస్సు

బలిజేపల్లి(వేమూరు): బలిజేపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు సుశీల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు తమ సమస్యలు రెవెన్యూ సదస్సు తీసుకొని వస్తే వాటిని పరిష్కారం చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

రెవెన్యు సదస్సులతో సమస్యలు పరిష్కారం

కొల్లూరు : రెవెన్యు సదస్సులతో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు సత్వరం పరిష్కరించడానికి వెసులుబాటు ఏర్పడిందని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని రావికంపాడు, క్రాప గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్న ఆయన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తెలుసుకోవడంతో పాటు అర్జీలను స్వీకరించారు. రావికంపాడులో 5, క్రాపలో 3 అర్జీలు బాధితులు అందజేశారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, వీఆర్ఓ నీలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేథపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న డాక్టర్ నాగ శ్రీనివాసరావు

మోతడక(తాడికొండ): ఏఐ, ఏఐఎంఎల్, డీప్ లెర్నింగ్‌లో సాంకేతికతను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు అన్నారు. కళాశాల ఏఐ, ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో 3 రోజుల పాటు జరగనున్న కృత్రిమ మేథ వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించి, మాట్లాడారు. 2025 సంవత్సరాన్ని ఏఐ సంవత్సరంగా అకిల భారత సాంకేతిక విద్యా మండలి ప్రకటించినట్లు చెప్పారు. విద్యార్థులు కృత్రిమ మేథపై అవగాహన పెంపొందించుకునేందుకు ఏఐ, ఏఐఎంఎల్, డీప్ లెర్నింగ్ అప్లికేషన్స్, రియల్ టైం సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.